# లవ్ స్టోరి

# ఎ సిల్లీ లవ్‌స్టోరి

అవి నేను ఖానాపురంలో ప్రయివేటు గురుకులంలో టీచర్‌గా పనిచేసి మా సొంత ఊరు 'వరంగల్'కి వచ్చి ఆ సుందరమైన గ్రామాన్ని మరువలేక గడుపుతున్న రోజులు.

అలాంటి సందర్భంలో ఖానాపురం నుండి నాకో ఉత్తరం వచ్చింది. ఇంట్లో తిరిగ్గా నా కొచ్చిన ఉత్తరాన్ని విప్పి చదవడానికి ఉపక్రమిస్తూ సంబోధన చదివి ఖంగుతిని ఆసక్తిగా చదవడం మొదలెట్టాను.

ఖానాపూర్ (నర్సంపేట్)
తేది : 20-4-82

ప్రియాతి ప్రియమైన శ్రీనివాస్‌గారికి,

మీ 'స్పందన' వ్రాయునది. 'ప్రియాతి...' అనే సంబోధన చదివి కోపగించుకోరు కదా! నేనెవరో మీకు తెలియకున్నా మీరు నాకు తెలుసు. అంతేకాదు, మీ మనస్తత్వం, అభిరుచులు, మీ కవితా హృదయం...ఒకటేమిటి మీ గురించి అంతా తెలుసు. కాని నాకు తెలియని దొకటే. మీ మనసులో నాకు చోటుంటుందో లేదోనని... నేను ఎన్నోసార్లు మీతో కలిసి మాట్లాడుదామని, మిమ్మల్ని పెనవేసుకుని మీ వక్షంపై నా తల బ్రద్దలుకొట్టుకుని రోదించి నా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నాను. మీ పరిచయ భాగ్యం కలగాలని ఎన్నోసార్లు మీ గురుకులం వద్దకు ఏదో పని వున్నదాన్లా వచ్చేదానిని... అక్కడికి మా పిన్ని ఇల్లు చాలా దగ్గర. మా పిన్ని ఇంట్లో నుండి చూస్తే మీరు పాఠాలు చెప్పే తరగతి గదులు చాలా స్పష్టంగా కనిపించేవి. మా పిన్నితో మాట్లాడుతూ మిమ్మల్ని గమనించేదానిని. పాఠాలు చెప్తుంటే మిమ్మల్ని అలాగే చూస్తుండి పోయేదాన్ని. నాలో ఏదో తెలిని అనుభూతి కలిగేది. ఒకసారి బహుశా ఆదివారమనుకుంటా, మీరు ఒంటరిగా వున్న సమయం చూసి మీ వద్దకొచ్చి నన్ను నేను పరిచయం చేసుకుని ఏదో రకంగా మీకు దగ్గరవాలని మీ శిష్యురాలు 'నివేదిత'తో మా పిన్ని ఇంటికొచ్చాను. అక్కడి నుండి చూసిన నాకు 'హాస్టల్' ప్రక్కగా వున్న తరగతి గదిలో మీరు ఒంటరిగా కూర్చుని ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కన్పించారు. మీరు కూర్చున్న తీరు చూస్తే మీరు ఏదో విచారంలో వున్నారని తెలుస్తూనే వున్నది. మిమ్మల్ని ఆ స్థితిలో అలా చూడగానే నాకు దుఃఖం ముంచుకొచ్చింది. మీ వద్దకు పరుగెత్తుకొచ్చి మిమ్మల్ని నా ఒడిలోకి తీసుకొని నా ఆనందాన్ని మీకిచ్చి మీ వేదనంతా నేను తీసుకోవాలనుకున్నాను. ఒక నిశ్చయానికి వచ్చినదాన్లా కళ్ళు తుడుచుకుని మీ వద్దకు రావడానికి మీ వైపు రెండడుగులు వేశానో లేదో మీ వద్దకు కొంత మంది పిల్లల్ని తీసుకుని ఓ మాస్టారు రావడం — వారేదో మీకు చెప్పడం — మీరు మీ గదిలోకి వెళ్ళడం జరిగిపోయింది.

అటు తర్వాత కాసేపటికి ఇంటి నుండి పిలుపు వస్తే నిరాశగా వెళ్ళిపోయాను. ఇక మా నాన్నగారు రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఇక్కడికి అప్పుడప్పుడు వచ్చి వెడుతుంటారు. మా కిక్కడ ఆస్తి ఉండడం మూలాన అమ్మా, నేను ఇక్కడ వుండిపోయాం. మన ప్రేమకి, పెళ్ళికి ఎలాంటి అభ్యంతరమూ వుండదు. వాళ్ళది ప్రేమ వివాహమే కనుక అమ్మా, నాన్న నా కోరిక కాదన లేరు..., కానీ మీతో కనీసం ఒక్కసారైనా మాట్లాడలేదు సరికదా మీరు నన్ను కనీసం చూడనైనా చూడలేదు. ఈ నా పిచ్చి ప్రేమను తప్పుగా అర్థం చేసుకోరు కదా!? మిమ్మల్ని ఇంత గాఢంగా ప్రేమించడానికి చాలా కారణాలున్నాయి. ముఖ్యంగా నాకు నచ్చిన ఉత్తమ లక్షణాలన్నీ మీలో వున్నాయి. పైగా నేను ఇష్టపడే రూపం మీది. కాని నా ఆనందానికి అడ్డుకట్ట వేసేది ఒకటే. నా అతి ప్రేమను తప్పుగా అర్థం చేసుకుని నన్ను అసహ్యించుకొని తిరస్కరిస్తారేమోననే అనుమానం నన్ను వెంటాడుతున్నది... నిజానికి నేను 'కళ్యాణ్ దుర్గం'లో మా పెదనాన్న వద్ద వుండేదాన్ని. నా చదువు సంధ్య అక్కడే సాగింది. అమ్మ ఒంటరితనం భరించలేక ఖానాపురం పిలిపించుకున్నది. నేను ఫిబ్రవరి నెలలో ఖానాపురం వచ్చాను. అంతకు ముందే రావడం జరిగితే మీతో ఎలాగైనా పరిచయ భాగ్యం పొందేదానినే. ఇక మీతో ఏకాంతం కొరకు తపించిపోతున్న సందర్భంలో ఊహించని పరిణామాలు జరిగాయి.

తెల్లవారింది. అది 'ఏప్రిల్ పన్నెండవ తారీఖు. అన్ని పనులూ ముగించుకుని నివేదిత కోసం వాళ్ళింటికి వెళ్ళాం. తర్వాత ముగ్గురం మా పిన్నింటికి వచ్చి మా నివేదితను మీ గదికి తోలాము. మీరు వస్తారేమోనని ఎంతో ఆత్రుతగా ఎదురుచూసిన మాకు నివేదిత ఒక్కతే రావడం కనిపించింది. "మీ నాన్నగారితో కలిసి మీరు కాసేపటి క్రితమే వరంగల్ వెళ్ళిపోయారని... వచ్చే సంవత్సరం ఇక్కడికి రారని, పై చదువుల కోసం వరంగల్‌లోనే వుండిపోతారని" చెప్పింది. అది వినగానే భూమి రెండుగా చీలి అందులో కూరుకుపోతున్నట్టుగా ఫీలయ్యాను. ఏమీ తోచక శ్రుతి మీద వాలిపోయాను. శ్రుతి ఎంత ఓదార్చుతున్నా నా ఆవేదన అంతకంతకు ఎక్కువైందేగాని తగ్గలేదు. నాలో ఏదో ఉద్వేగం, తెగింపు కలిగాయి. ఒక్కసారిగా పరుగు పరుగున మీ కోసం బస్ స్టాపుకు చేరుకున్నాను. కాని నేనక్కడికి చేరుకోవడం, మీరు ఎక్కిన బస్ కదిలి ముందుకు సాగడం వెంటవెంటనే జరిగి పోయాయి. నా కప్పుడు ఆందోళనగా నాతో పాటు పరుగెత్తుకుంటూ వచ్చిన 'శ్రుతి'గాని, చుట్టుపక్కల వున్న వ్యక్తులు గాని నాక్కనిపించ లేదు. నా కప్పుడు ఒకే లక్ష్యం — బస్సు నెలాగైనా ఆపాలి. నలుగురూ చూసినా సరే- మీ ప్రయాణాన్ని ఆపేసి బోరున ఏడవాలని బేలగా మారిపోయి మీతో నా ప్రేమను వెల్లడించాలనుకున్నాను. అందుకే

రచయిత చిరునామా:
ఎ. శ్రీనివాసరాజు (మెడికో)
4-2-71, కొత్తూర్,
హన్మకొండ పోస్టు,
వరంగల్ - 506 001

ఉద్వేగంతో మీ బస్సు వెనకే పరుగెత్తుకొచ్చాను. ఎవరో ఒకతను నన్ను బస్సులోంచి గమనించి బస్సుని బాదాడు ఆపాలని. అయినా దూర తీరాలలో తనకేదో పని వున్నట్టు మీ రెక్కల బస్ కాస్తా నా కళ్ళ ముందే కనుమరుగైంది. అటు తర్వాత నే నెంత ఆవేదన అనుభవించానో మాటల్లో చెప్పడానికి మీలాగ నేను కవిని కూడా కాదు... ఇక నాకు ఒకే ఒక మార్గం కనిపించింది. ఎలాగైనా మీ చిరునామా సంపాదించి మీ కిలా లేఖ వేసి మీ ప్రేమ వర్థించాలనుకున్నాను. నివేదిత ద్వారా నా ప్రయత్నం ఫలించింది. మీ విద్యార్థులలో కొందరికి మీ అడ్రస్ ఇచ్చిన విషయం తెలిసింది. 'శ్వేత' అనే అమ్మాయి వద్ద నుండి మీ చిరునామా సంపాదించాను..., ఈ ఉత్తరం ఇలా పూర్తి చేస్తున్నంతలో నాన్నగారు పిడుగు లాంటి వార్త తెచ్చారు. నాన్నగారి ఫ్యాక్టరీ వ్యవహారాల విషయమై 'బ్రెజిల్' వెళ్ళాలని. నాన్నతో పాటు ఆ దేశం వెళ్ళడానికి పాస్ పోర్టులు కూడా సిద్ధం చేశారు. బహుశా మేము 'మే' నెలలో మొదటి వారంలో వెళ్ళవచ్చు కాబట్టి మీరు ఈ ఉత్తరం చదవగానే ఏప్రిల్ ముప్పయవ తారీఖున ఇక్కడికి రాగలరు. నాన్నగారికి మన విషయం చెప్పాను. నాన్నగారే పై తారీఖు నిర్ణయించారు. ఆ రోజు మీ కోసం బస్టాప్‌లో మా పాలేరబ్బాయి ఎదురుచూస్తుంటాడు. అతడు మిమ్మల్ని గుర్తు పడతాడు. అయితే ఇక్కడ ఇంకో విషయం మీకు చెప్పాలి. అమ్మా నాన్నతో మన మధ్య ఎంతో సాన్నిహిత్యం వున్నదని అబద్ధమాడాను. మీరు మా ఇంటికొచ్చాక మనకిదివరకే పరిచయ మున్నట్టుగా ప్రవర్తించండి. మీరు తప్పకుండా అదే రోజు రావాలి. ఎందుకంటే మేము దక్షిణామెరికా నుండి ఇండియా రావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో చెప్పలేను. ఇక మీరు రాకపోతే నా ఈ అతి ప్రేమను అపార్థం చేసుకున్నారని భావించుకుని నాలో నేను కుమిలి పోతూ ఇలాగే మిగిలిపోతా.

ఎదురుచూసే మీ స్పందన. నాలో తుపాను ఫోటో చూశాక అది రెండింతలైంది. ఆమెను పొందలేని నా జీవితం వ్యర్థమనుకున్నాను. కాని ఇంతలోనే నా నవనాడులు కృంగిన భావనతో కుప్పకూలిపోయాను. కారణం ఆమె ఏప్రిల్ ఇరవైన నాకు ఉత్తరం వేస్తే అది నాకు జూన్‌లో అందింది. అంటే సరిగ్గా నెల రోజులు ఆల స్యంగా చేరిందన్న మాట. కేవలం తపాలా వ్యవస్థ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని తెలుసుకున్నాక నవ్వాలో, ఏడవాలో కూడా తెలియలేదు. అయినా ఆశ చావక భావాపురం వెళ్ళాను. వారంతా బ్రెజిల్ వెళ్ళి నెల రోజులౌతున్నట్టుగా తెలిసింది. నిరాశగా ఇంటి దారి పట్టాను...

అటు తర్వాత కాల ప్రవాహంలో ఆరేళ్ళు గడిచాయి. స్పందనను దాదాపుగా మరిచి పోయాను. నేను డాక్టర్‌గా స్థిరపడ్డాను. ఎలాగైతేనేం ఇంట్లోవాళ్ళ ప్రోద్బలంతో నా మిత్రుడు రెడ్డితో కలిసి తిరుపతికి దగ్గరే వున్న 'సత్యవేడు'కి పెళ్ళిచూపుల కోసం వెళ్ళాను. బస్ స్టాండులో బస్సు దిగి బయటకొస్తుంటే యాదృచ్ఛికంగా జరిగిందా సంఘటన. నిజానికా సంఘటన జరక్కపోతే ఈనాటికి ఇలా స్పందనను గుర్తుతెచ్చుకునే వాడిని కాదేమో!... ఫారిన్ కారొకటి మా ముందు పార్కు చేసి వున్నది. దాన్ని దాటుకుంటూ కాస్త దూరం వెళ్ళగానే "ఏమండీ శ్రీనివాస్ గారు బాగు న్నారా" అనే పలకరింపుతో వెనక్కి తిరిగి ఆగిపోయాను. పోతపోసిన శిల్పంలా ఆమె... ఆమె స్పందన.



నవ్వుతూ మా వైపు వచ్చింది. "నేనండి స్పందనని. ఆరేళ్ళ క్రితం మీకో ఉత్తరం రాశానే ఆ స్పందననే నేను... మద్రాస్ నుండి తిరుపతి వెళ్తున్నామండి. అదిగో ఆ ఇల్లు చూశారా అది మా ఆడపడుచుది. ఆమెను కూడా మాతో తీసుకెళ్దామని ఈ ఊరొచ్చాం... అనుకోకుండా మీరు కనిపించారు. పలుకరిద్దామని బయటకొచ్చాను" గల గలా ఎంతో చనువుగా ఆమె మాట్లాడుతుంటే అయోమయంతో సమయస్ఫూర్తి తెలియని చవటగా మారిపోయాను. ఇంతలో మా వైపు ఒకతను, అతనితో ఓ కుర్రాడు వచ్చారు. అతడిని నాకు పరిచయం చేస్తూ, "వీరు నా భర్త. డాక్టర్ మనోహర్... వీడు మా బాబు అంబరీష్" అన్నది. యాంత్రికంగా కరచాలనం చేశాను. "వీరు మా ఊళ్ళో మా ఇంటి దగ్గర స్కూల్లో పని చేశారులెండి—" అంటూ తన భర్తతో చెప్పింది... ఆమె భర్త నాకు తిరిగి కరచాలనం చేయడం, కారులో కూర్చోవడం, వాళ్ళందరు కారులో కనుమరుగవ్వడం చకచకా జరిగిపోయాయి. రెడ్డి నన్ను పట్టుకుని ఊపేంత వరకు ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయాను. పెళ్లి చేసుకుని నవ్వుగా కళకళలాడుతున్న ఆమెతో 'ఆనాడు నీవు నాకు వేసిన ఉత్తరం ఆలస్యంగా అందింది. నీ కొడుకుని, నీ భర్తని లేపి నా వెంటరా' అని రాక్షస ప్రేమతో పిలిచే కుసంస్కారిని కాదు నేను. అందుకే కాసేపటికి నన్ను నేను సమాధాన పర్చుకున్నాను.

'సత్యవేడు'లో పై సంఘటన జరిగి దాదాపుగా రెండేళ్ళవుతున్నది. ఆనాడు ఎవరింటికైతే వెళ్ళానో ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకున్నాను. ఒకసారి నా శ్రీమతితో 'స్పందన' విషయమంతా చెప్పాను. మమ్మల్ని విడదీసిన తపాలా సంస్థని తూర్పారబట్టాను. కాని మా శ్రీమతి మాటలు వినేసరికి నాకు మతిపోయినట్టయింది. "అట్లా జరగడం వల్లే కదా మీరు నాకు భర్తగా దొరికింది" అని అనడమే కాక అప్పటి నుండి తపాలా సంస్థపైనే కాదు మా ఇంటికి ఉత్తరాలు మోసుకొచ్చే పోస్ట్‌మెన్ కనకారావన్నా మా ఆవిడకి చెప్పలేనంత అభిమానం... అటు తర్వాత నన్ను భర్తగా పొందాలనుకున్న స్పందన స్వప్నం, నన్ను అమితంగా ప్రేమించిన స్పందనను పొందాలనుకున్న నా స్వప్నం రెండూ కాలగర్భంలో కలిసిపోయాయి. ■

## ర హ స్యా లు



చీకటి గుహల్లో
గీసిన చిత్రాలు
కొన్ని రహస్యాలు!
ఎద దివ్వెను వెలిగించుకొని
చూస్తేనే అవి ఆనందకరం!

కొమ్మల రెమ్మల్లో
ఆకుల గుసగుసలు
కొన్ని రహస్యాలు!
ఏకాంతవేళలో ఉండి
వింటేనే అవి ఆహ్లాదకరం!

పడుచు గుండెల్లో...
పరస్పరం అర్థం గాకుండా
స్పష్టాస్పష్టంగా
మినుకు మినుకుమంటూండే
మాటల నక్షత్రాలు
కొన్ని రహస్యాలు!
సూర్యుడి లాగా వేడి గానో,
చంద్రుడి లాగా చల్లగానో-
అతి స్పష్టంగా
ఎంత త్వరగా బయటపడిపోతే
అవి-అంతగా శ్రేయస్కరం!

—'రఘువర్మ'

భూగోళమంతటా
సంచలనం సృష్టిస్తున్న
మిలియన్ డాలర్ గేమ్
టెన్నిస్ నేపథ్యంలో సాగే
ప్రత్యేక తరహా
రొమాన్సెంటిమెంటల్
సెన్సేషన్
స్పోర్ట్స్‌మన్ రైటర్
ఉపద్రష్టసాయి రాస్తున్న ఆల్
ఏజెస్ హిట్ నవల

లవ్ ఆల్

